క్లుప్తంగా

రేపు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవస్థాపకుడు అంబటి మురళీ కృష్ణ చెప్పారు. శనివారం పెదకాకానిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పెదకాకాని శ్రీ వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి బజరంగ్ నేత్రజ్యోతి ద్వారా ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. థలసేమియా రోగులకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. వలంటీర్లకు అవగాహన, పోటీ పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. స్కూల్‌కు వెళ్ళే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వలంటీర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు.

జపాన్ పర్యటనకు ఏఎన్‌యూ ఫార్మసీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జపాన్‌లో పర్యటించనున్నారు. ఏఎన్‌యూకి ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డివిజన్ ఆఫ్‌ది టొయోమో ప్రిఫెక్చర్స్ గవర్నమెంట్‌తో ఉన్న సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు ఎస్. శ్రావణి, జి. తేజేష్, ఏ. కృష్ణ పర్యటనలో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ ఎ. ప్రమీలారాణి తెలిపారు. ఫార్మసీ కోర్సులో మెరిట్ ఆధారంగా వీరిని పర్యటనకు ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జపాన్‌లోని యూనివర్సిటీని సందర్శించి అక్కడ విద్యా విషయక అంశాల్ని అధ్యయనం చేస్తారని చెప్పారు. జపాన్ పర్యటనకు వెళుతున్న విద్యార్థుల్నిగురువారం వీసీ పి. రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. సిద్ధయ్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన కూలీలు

పెదకాకాని: మొక్కజొన్న పైరుకు గుళికలు వేసేందుకు వెళ్ళి అస్వస్థతకు గురైన కూలీలు ఆస్పత్రిలో చికిత్స పొంది క్షేమంగా గురువారం ఇంటికి చేరుకున్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన 20 మంది కూలీలు నిడమర్రులో మొక్కజొన్న పైరుకు మొవ్వ పురుగు ఆశించకుండాగుళికలు వేసి బుధవారం అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. గుంటూరుకు చెందిన ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం బుధవారం రాత్రి 17 మందిని డిశ్చార్జి చేశారు. వారిలో మిగిలిన ముగ్గురిని రాత్రి డాక్టర్ పర్యవేక్షణలో ఉంచారు. పూర్తిగా ఆరోగ్యం కుదుట పడటంతో గురువారం వారిని కూడా ఇంటికి పంపించారు. అందరూ క్షేమంగా ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు, పొలం యజమాని ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రి నుండి డిశ్చార్జి అయిన వారిలో ముఠా మేస్త్రి కొణతం సామ్రాజ్యంతోపాటు కళ్యాణం శిల్పారాణి, కాసుల ధనలక్ష్మి, గోపిశెట్టి అంజమ్మ, లక్ష్మిశెట్టి కుమారి, అకరంశెట్టి కృష్ణవేణి, నందిపాటి అనమాయమ్మ, బత్తుల శీతారావమ్మ, పల్లెంపాటి నాగలక్ష్మి, పసుపులేటి శ్రీలక్ష్మి, పసుపులేటి శారద, ఆవుల సత్యవతి, పిన్నమనేని పద్మ, దంతాల స్వాతి, పుసుపులేటి సాంబ్రాజ్యం, పల్లెంపాటి అనంతకుమారి, గంగిశెట్టి అచ్చమ్మ, గోపిశెట్టి వెంకాయమ్మ, పల్లెంపాటి త్రివేణి, గంగిశెట్టి విజయ ఉన్నారు.

నిందితుడి ఆచూకీ తెలపండి !



గుంటూరు ఈస్ట్: గత ఏడాది డిసెంబరులో ప్రియా గార్డెన్స్ ఫంక్షన్ హాలులో పెద్ద మొత్తంలో బంగారు నగలు చోరీ చేసిన వ్యక్తిని సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా గుర్తించినట్లు ఎస్‌హెచ్‌ఓ రామా నాయక్ గురువారం తెలిపారు. నిందితుడి ఫొటోను ఆయన పత్రికలకు విడుదల చేశారు. ఫోటోలోని వ్యక్తిని, అతని వివరాలు తెలిసిన వారు 8688831332, 9705643699 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: మద్యం తాగవద్దని కుటుంబసభ్యులు పదే పదే చెబుతుండడంతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చినరావూరు రైస్ కాలనీకి చెందిన సారథి శరత్‌కుమార్(31) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వైద్యులు మద్యం తాగవద్దని సూచించారు. అప్పటి నుండి తల్లిదండ్రులు, భార్య మద్యం చెబుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గదిలోకి వెళ్లిన అతను చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం గమనించిన కుటుంబసభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షిత ప్రయాణానికి రోడ్డు భద్రత తప్పనిసరి

మేయర్ కావటి



భద్రతా వారోత్సవాల ర్యాలీలో మేయర్ కావటి మనోహరనాయుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి, రవాణా శాఖాధికారి కరీం

పట్నంబజారు: సురక్షిత ప్రయాణానికి వాహనదారులంతా రోడ్డు భద్రతను పాటించాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన వాక్‌థాన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. మేయర్ కావటి, ఆర్డీవో కె. చంద్రశేఖరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ షేక్ కరీం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ర్యాలీలో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ రహదారి భద్రత పాటించటం ద్వారా విలువైన ప్రాణాల్ని కాపాడుకోవడంతో పాటు, ఇతరుల ప్రాణాల్ని కూడా కాపాడినవారమవుతామన్నారు. ఒక కుటుంబ పెద్ద కోల్పోతే, ఆ కుటుంబానికి కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారోత్సవాల్లో భాగంగా వాక్‌థాన్‌లు, అవగాహన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఏఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రహదారి భద్రత అనేది సామాజిక బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా అనేక కార్యక్రమాల్ని చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఏడాదికి నాలుగు లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయని, 1లక్ష50 వేల మంది మృతి చెందడం బాధాకరమని తెలిపారు. అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం ద్వారానే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, 38 శాతం ద్విచక్ర వాహనాల ద్వారానే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి మాట్లాడుతూ అతివేగం వల్ల అనర్థాలు జరుగుతాయని, తలకు తీవ్రమైన గాయాలవ్వడం ద్వారానే ప్రాణాలు అధికంగా కోల్పోతుని చెప్పారు. రవాణా, పోలీసు శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాల్ని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఎంవీఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

విట్ చాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెల్లూరు విట్ చాన్సలర్ విశ్వనాథన్

ఏఎన్‌యూ: వ్యక్తి, కుటుంబం, సమాజం సర్వతోముఖాభివృద్ధికి విద్యే మార్గమని వెల్లూరు విట్ చాన్సలర్, మాజీ మంత్రి డాక్టర్ జి. విశ్వనాథన్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథన్ ప్రసంగిస్తూ మన సమాజంలో పేదరికం, అసమానతలు పెరగడానికి విద్య లేమి ప్రధాన కారణమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశం నేటికీ పేదరికంతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందితే, అక్కడి ప్రజలందరూ అభివృద్ధి చెందుతారని కానీ మన దేశంలో అలా జరగడం లేదని తెలిపారు. గడచిన 50 ఏళ్లలో సంపద, అభివృద్ధి అనే అంశాల్లో తీవ్రమైన అసమానతలు చోటు చేసుకున్నాయని చెప్పారు. మన సమాజంలో నేడు అణగారిన వర్గాలుగా ఉన్న 50 శాతం మంది వద్ద ఆరు శాతం సంపద ఉంటే, అగ్ర స్థానంలో ఉన్న పది శాతం మంది వద్ద 63 శాతం, ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద 31శాతం సంపద ఉందని వివరించారు. ఈ అసమానతల్ని అధిగమించేందుకు విద్య దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యక్తికీ జీవితంలో క్రమశిక్షణ, సహాయం చేసే తత్వం చాలా ముఖ్యమని, అవి లేకపోతే చాలా కోల్పోతామని తెలిపారు. విద్యార్థులు ఇంటర్మీడియెట్ తరువాత మూడు సంవత్సరాల కాలం చాలా క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని సూచించారు. జీవితంలో కీలకమైన ఆ సమయంలో ఆనందానికి ప్రాధాన్యత ఇస్తే.. జీవితాంతం కష్టాలపాలు కావాల్సి వస్తుందని తెలిపారు. మంచికి ఉపయోగించుకోవాల్సిన డబ్బులతో జీవితాన్ని, ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి ఉన్నతంగా ఉండటంలో అతని ఆరోగ్యం, అలవాట్లు ఎంతో కీలకమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విద్యా సంస్థ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్‌లో గురువుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ విద్యార్థులు తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే వారి జీవితం ఉన్నతంగా రూపొందుతుందన్నారు. తమలో ఉన్న అనంతమైన సామర్థ్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ఏఎన్‌యూలో ప్రతి విభాగంలో ఒక సెమిస్టర్‌కు కనీసం పది మంది విదేశీ అధ్యాపకులు, నిపుణులతో విద్యార్థులకు బోధన చేయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విట్ ఏపీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి. కోటారెడ్డి ప్రసంగిస్తూ కష్టపడకుండా ప్రత్యామ్నాయం లేదనేది విద్యార్థులు గుర్తించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఓఎస్‌డీ ఆచార్య సునీత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య , డీన్ ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రిన్సిపాల్స్ ప్రసంగించారు. ఏఎన్‌యూ, విట్ సంస్థల మధ్య ఎంఓయూ(అవగాహనా ఒప్పందం) పత్రాల్ని ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్, విట్ చాన్సలర్ డాక్టర్ విశ్వనాథన్ మార్చుకున్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు కృషి

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

కొరిటిపాడు(గుంటూరు): ఎల్ఐసీ జాతీయకరణ దినోత్సవం సందర్భంగా అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం అధికారులు, ఉద్యోగులు, ఏజంట్స్ ప్రతిజ్ఞ చేశారు. ఎల్ఐసీని పరిరక్షించుకుని సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఆర్‌వీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన ఎల్ఐసీ నేటికి సుమారు రూ.42 లక్షల కోట్ల ఆస్తులతో అగ్రగామి ఆర్థిక సంస్థగా నిలిచిందని తెలిపారు. పాలసీదారుల సొమ్ముకు భద్రత కల్పించడంలో ప్రైవేటు బీమా రంగం ఘోరంగా విఫలమైన నేపథ్యంలో 1956లో ఆనాటి 245 ప్రైవేటు బీమా సంస్థల్ని విలీనం చేయడం ద్వారా ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీని ఏర్పరచారని వివరించారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ అధ్యక్షుడు బి.మార్కండేయులు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం ఏర్పడ్డ ప్రతి ప్రభుత్వరంగ సంస్థను సమూలంగా ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోందని, అందుకు చట్టాలను సైతం మార్చేస్తోందని ఆరోపించారు. దేశ ఆర్థిక స్వావలంబనకు ప్రత్యక్ష చిహ్నంగా ఉన్న ఎల్ఐసీని, ఏజెంట్స్ వ్యవస్థను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పాలసీదారులు, ఏజెంట్స్, సిబ్బంది కలిసి ఐక్యతతో సంస్థను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బ్రాంచి మేనేజర్ వి.మాధవ కృష్ణ మాట్లాడుతూ 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ రూ.2.18 కోట్ల కొత్త పాలసీలు సేకరించి 3.56 శాతం అభివృద్ధిని నమోదు చేసిందన్నారు. మార్కెట్‌లో ఎల్ఐసీ షేర్ తగ్గినప్పటికీ బీమా మార్కెట్ వాటాలో ఎల్ఐసీదే ఆధిపత్యమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, నాయకులు జి.శివరామకృష్ణారావు, రవికుమార్, రాజేశ్వరరావు, శ్రీదేవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్ సేవలు భేష్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని, అంతర్జాతీయ స్థాయికి తగినట్లుగా వైద్య సేవలు రోగులకు అందిస్తున్నారని పలువురు గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు పేర్కొన్నారు. గురువారం జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను 1971 గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు సందర్శించారు. క్యాన్సర్ రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి నాట్కో ట్రస్టు సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ వారికి వివరించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతిని కలిశారు. కార్యక్రమంలో పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ త్రిపురనేని రవికుమార్, డాక్టర్ వెనిగండ్ల బాలభాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తిని మోసం చేసిన సంస్థలపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి రెండు సంస్థల్లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన బాలాజీ సింగ్ గుంటూరు లక్ష్మీపురంలో వివిధ స్కీంలు నడుపుతున్న సురక్ష సంస్థ, బ్రాడీపేటలోని ఆభరణ సంస్థల్లో రూ. 10 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. మొదట్లో రెండు సంస్థలు వారు ప్రకటించిన స్కీం ప్రకారం బహుమతులు ఇచ్చాయి. అనంతరం డబ్బు వాపస్ ఇవ్వకపోగా, స్కీంలో పేర్కొన్న బహుమతులు ఇవ్వలేదు. తాను మోసపోయినట్లు గుర్తించి బాలాజీసింగ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నివాసరావు, మందిర వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఈనెల 20వ తేదీ నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి తెలిపారు. మందిర ఆవరణలో గురువారం మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సుందరరామిరెడ్డి మాట్లాడారు. 20న సాయంత్రం 5 గంటలకు శ్రీవారి గ్రామోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 6 గంటల నుంచి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, యంత్ర పునఃశ్చరణ, హోమం, విశేష పూజా కార్యక్రమాలు, 22న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, ఏకాశీతి, పంచవింశతి, నవకలశ స్థాపన, తీర్థప్రసాద గోష్టి, 23న ఉదయం 6 గంటల నుంచి వేద పారాయణాలు, విశేష హోమాలు, 9.59 నిమిషాలకు బింబ స్థాపన (విగ్రహ ప్రతిష్ట) అనంతరం పూర్ణాహుతి, అన్న సంతర్పణ ఉంటుందని తెలిపారు. 24న ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, ఆచార్యసంభావనం జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, సభ్యులు వెంకటేశ్వరరావు, రామశంకరరావు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



అప్పిరెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

నెహ్రూనగర్: టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ సమావేశం చైర్మన్ లంక రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా స్పిన్నింగ్ పరిశ్రమ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ముఖ్యంగా విద్యుత్తు సబ్సిడీ బకాయిలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అసోసియేషన్ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అప్పిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్లు సామినేని కోటేశ్వరరావు, ఎం. సత్యనారాయణ, కోటిరావు, ప్రసాద్ చౌదరి నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు జిల్లా హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తించిన బాల గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఫ్లాగ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10 వేల చెక్కుని బాల భార్య దేవమణికి గురువారం జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో మినిస్ట్రీయల్ సిబ్బంది స్టీఫెన్, పవన్ పాల్గొన్నారు.

వేమన కవితలు సామాజిక చైతన్య ప్రతీకలు



ఏఎన్‌యూలో యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రమా జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు



జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులతో కలిసి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవానంద్



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి



వేమన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్

-ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: యోగి వేమన కవితలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు, ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యోగి వేమన జయంతి వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి సభలో వీసీ ప్రసంగిస్తూ మానవ జీవన విధానానికి వేమన పద్యాలు సజీవ సాక్ష్యంగా నిలిచాయని తెలిపారు. జాతి గర్వించదగ్గ ఆణిముత్యమని ప్రశంసించారు. ఒంగోలు ప్రభుత్వ మహిళా కళాశాల ఆచార్యులు డాక్టర్ వి. నాగరాజ్యలక్ష్మి కీలకోపన్యాసం చేశారు. వేమన సాహిత్యంలో విభిన్నకోణాలు ప్రతిబింబిస్తాయన్నారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, తెలుగు విభాగాధిపతి ఈ. మాధవి, అధ్యాపకులు ఎన్.వి. కృష్ణారావు ప్రసంగించారు. నూటా అధ్యక్షుడు బి. నాగరాజు, పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాకవి యోగి వేమన

గుంటూరు ఎడ్యుకేషన్: లౌకికతత్వంతో సమాజాన్ని చైతన్యపర్చిన మహాకవిగా యోగి వేమన ప్రసిద్ధి చెందారని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం విశ్వకవి యోగివేమన 610వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ లౌకికతత్వం, తాత్వికత కలగలసిన వేమన ఒక సమగ్రమైన జ్ఞాని అని కొనియాడారు. తెలుగుశాఖ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ వేమన పద్యాల్లోని సామెతల గురించి వివరించారు. విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కవీశ్వరానందస్వామి గుత్తికొండ రామకోటిరెడ్డి, అధ్యాపకులు వి. భవాని, డి.ధాత్రికుమారి, ఎస్. దివిజాదేవి, పి.విజయలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్తగా జ్ఞానాన్ని పంచిన యోగి వేమన

ప్రజాకవి, సంఘ సంస్కర్తగా ప్రజల్లో జ్ఞానాన్ని పెంపొందించడంలో యోగి వేమన విశేష కృషి చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం యోగి వేమన 610వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినుర వేమ అనే మాట వినని తెలుగువారు ఉండరని అన్నారు. అనంతరం విద్యార్థులతో వేమన శతక పద్యాలు చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్. నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, సిబ్బంది సుబ్బారావు, పి. కృష్ణ, పి. కోటేశ్వరి, జి. అచ్చమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నివాళి

నెహ్రూనగర్: నిజ జీవిత సత్యాలు, మానవతా విలువల్ని పద్యాల రూపంలో ప్రజలకు అందించిన మహనీయుడు, ప్రజా కవి యోగి వేమన అని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన ప్రజా సాహిత్యాన్ని నేటి తరానికి అందించే కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, అదనపు కమిషనర్ పి.రోజ, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, విభాగాధిపతులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

తొలి తెలుగు ప్రజా కవి

పాత గుంటూరు: తొలి తెలుగు ప్రజా కవి యోగి వేమన అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని హోటల్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్– జాషువా– పూలే – పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి. విల్సన్ ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. తొలుత యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మూఢాచారాలపై యోగి వేమన తన కలాన్ని ఎక్కుపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో కవులు, రచయితలు డాక్టర్ పాపినేని శివశంకర్, వరయూరి మధుసూదనాచారి, పోతురాజు దుర్గాదేవి, రావెల సాంబశివరావు, సంజీవరెడ్డి, చల్లా మధుసూదనరావు, కన్న మాస్టారు పాల్గొన్నారు.

వేమన్న వాదం ఆధునిక వేదం

లక్ష్మీపురం: వేమన్న వాదం ఆధునిక వేదమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త ముప్పాళ్ల వి.ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతికి నూతన వ్యక్తిత్వాన్ని ప్రసాదించిన సాధకుడు, బోధకుడు యోగి వేమన అని తెలిపారు.కార్యక్రమంలో అవగాహన సంస్థ సీనియర్ సభ్యుడు, నాటక రచయిత కావూరి సత్యనారాయణ, కవి బండి జమదగ్ని పాల్గొన్నారు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి: డీఈఓ



వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

వేజండ్ల (చేబ్రోలు): సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డీఈఓ పి.శైలజ ఉపాధ్యాయులకు చెప్పారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోని విద్యార్థుల వద్దకు వెళ్లి ఎస్ఏ–1 పరీక్ష పేపర్లు ఇచ్చిన తీరును పరిశీలించారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను పరిశీలించి, అత్యధిక మార్కులు సాధించిన వారిని అభినందించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులందరూ యూనిఫాం, బూట్లు, బెల్టు ధరించి పాఠశాలలకు తప్పనిసరిగా రావాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అందరూ భుజించేలా కృషి చేయాలని, భోజన నాణ్యత విషయంలో రాజీ వద్దని పేర్కొన్నారు. ఎస్ఏ–1 మార్కులు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, విద్యా బోధనను పరిశీలించారు. హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.